# ముకుందరావుగారింటి ముందు గది

ముకుందరావుగారింటి ముందు గదికో ప్రత్యేకత ఉంది.

ప్రహారీ గోడకు మధ్యగా గేటు; గేటు కెదురుగా సింహద్వారం; సింహద్వారానికి ఇరుప్రక్కలా వాస్తుశాస్త్రానికి సరిపోయేలా ఒకే కొలతలో రెండు వెడల్పయిన కిటికీలూ; వాటికి అందమైన పూల కర్టెన్లూ; గుమ్మంలోకి వెళ్ళేందుకు రెండు మెట్లూ - సింహ

ద్వారం ముక్కు అనుకుంటే రెండు కిటికీలూ పరిసరాల్ని చూడగలిగే రెండు కళ్ళుగానూ; మెట్లు రెండూ పెదవులుగానూ; కిటికీలపై నున్న సన్‌షేడ్స్ కనుబొమ్మలుగానూ; పైనుండే గుండ్రని వెంటిలేటరు బొట్టు గానూ - ఇంటి ఎదుటి భాగమంతా మనిషి ముఖాన్ని పోలి వుంటుంది. సింహద్వారం దాటితే ముందుగది - ఆ గదికి నాలుగు వైపులా నాలుగు గుమ్మాలు. ఒక గుమ్మం మీద గోడకు ముకుందరావుగారి ముత్తాతల్లో ఒకరైన వసంతవాడ సీతారామయ్యగారి బస్ట్ ఫోటో, దానికెదురుగా రెండో గుమ్మం మీద రష్యన్ చిత్రకారుడు పెట్రోవ్ - వోడ్కిన్ వేసిన 1915 సంవత్సరం నాటి 'మాతృమూర్తి' పెయింటింగూ; మిగిలిన రెండు గుమ్మాలపైనా దామెర్ల రామారావు గారి 'పెళ్ళికూతురు', రవివర్మ 'హంస- దమయంతి' - చిత్రాలు పెద్ద సైజులో వుంటాయి. ముకుందరావుగారి తండ్రి వంశధార ప్రాంతంలో ఒక ప్రాజెక్టులో పనిచేస్తుండగా ఎవరో బహుమతిగా యిచ్చిన మచ్చల లేడి చర్మం పడమటి గోడకు ద్వారం ప్రక్కనే వేలాడేదీసి వుంటే - తూర్పు గోడకు ఈశాన్య మూలగా కలువపూవులో కూర్చుని వున్న లక్ష్మీదేవి కేలెండరు గుమ్మం ప్రక్కన వుంటుంది.

గదికి పొడవు తక్కువ; వెడల్పు ఎక్కువ ఉండడం వల్లా; ఈశాన్య మూలనే ఖాళీస్థలం ఎక్కువ ఉండడం వల్లా తాతల నాటి ఓ కేన్ సోఫా సెట్టూ, ఒక టీపాయీ యింటికి వచ్చే అతిథుల కోసం అక్కడే సిద్ధంగా ఉంటాయి.

అయితే - ఇవేవీ ఆ ముందుగది యొక్క ప్రత్యేకతలు కానే కావు. ఆ గదికున్న ఒకే ఒక ప్రత్యేకత ముకుందరావుగారొక్కరికే తెల్సు. దాన్ని గురించి యింతవరకూ ఎవరికీ చెప్పలేదాయన.

ఆ యింటికి బంధువులు, స్నేహితులు, ఎవరొచ్చినా, ఆ ముందు గదిలోని సోఫాల మీదే కూర్చుంటారు. మాటా, మంతీ, పలకరింపులు, వ్యవహారాలూ అన్నీ అక్కడే!

ఆ యింటికొచ్చి అక్కడ కూర్చున్న వారెవరూ కాఫీయో, టీయో, పళ్ళరసమో, డ్రింకో - కనీసం మజ్జిగో.. తీసుకోకుండా మాత్రం వెళ్ళరు. ఆ గదిలో కూర్చున్న వాళ్ళెప్పుడూ ఆనందంతో మనసులు విప్పి మాట్లాడుకుంటున్నట్టుగా వుంటుంది. అయితే ఆ ముందు గదిలో కూర్చుని మాట్లాడినవారు ఆ గది దాటి బయటకు వెళ్ళేక తాము మాట్లాడిన విషయాలకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తించిన తీరు ఒక్కోకప్పుడు ముకుందరావుగార్ని ఆశ్చర్యంలో పడవేసేది. మొదట్లో కొన్నాళ్ళు ఆయన అంతగా పట్టించుకోలేదుగాని రాన్రాను ఆ విషయం ఆయనకు బాగానే నిరూపణ అయ్యింది.

పెద్దమ్మాయిని చూసుకోవడానికి పెళ్ళివారొచ్చినపుడు మరో నాలుగు కుర్చీలు వేసుకుని అందరూ ముందుగదిలోనే కూర్చున్నారు. పెళ్ళికొడుకు ఢిల్లీలో ఇంజినీరు. తండ్రి కూడా పెద్ద ఉద్యోగస్తుడే. చీకూ చింతా లేని కుటుంబం. అయినా వాళ్లకీ కట్నం తాము అడిగినంతా కావాలి. అమ్మాయి తెల్లగా అందంగా వుండాలి. చదువుకుని ప్రస్తుత పరిస్థితుల్లో, ఉద్యోగం చేయగలిగే ఓర్పూ నేర్పూ వున్న అమ్మాయి అయి ఉండాలి. అయితే ముకుందరావుగారికి వాళ్ళడిగినంత కట్నం యిచ్చుకునే స్థోమత లేదు. అమ్మాయి

కేవలం ఆర్ట్స్ గ్రాడ్యుయేట్ కాబట్టి అన్ని రకాలైన ఉద్యోగాలూ - ముఖ్యంగా కంప్యూటర్‌కి సంబంధించిన ఉద్యోగాలు - చేయడానికి వెంటనే పనికిరాదు. అయినప్పటికీ ముకుందరావు గారమ్మాయి అరుణ అందాల బొమ్మ కాబట్టి; అబ్బాయి నచ్చుకున్నాడు కాబట్టి అబ్బాయి యిష్టమే తల్లితండ్రులకూ కూడా కావల్సింది కాబట్టి వాళ్ళు అరుణనే చేసుకుంటామని అక్కడే చెప్పేశారు. సాధ్యమైనంత త్వరలో తాంబూలాలు పుచ్చుకుందికి వస్తామన్నారు. పెళ్ళికొడుకు అంత అందగాడు కాకపోయినా మిగిలిన అన్ని విషయాలూ తమ పెద్దవారికి నచ్చడంతో అరుణ కూడా ఆ సంబంధాన్ని అయిష్టం గానే ఒప్పుకుంది. వారం గడిచింది - నెల గడిచింది. మళ్ళీ వాళ్ళ నించి మరో వార్తయినా లేకపోయేసరికి ముకుందరావుగారు మధ్యవర్తి ద్వారా వాకబు చేశారు. తెల్సిందేమిటంటే - వాళ్ళకి అమ్మాయి కంప్యూటర్‌కి సంబంధించిన ఉద్యోగం వెంటనే చెయ్యగలగాలట. అంచేత కంప్యూటర్‌తో డిగ్రీ ఉన్న మరో అమ్మాయి కోసం చూస్తున్నారు. మంచి సంబంధం తప్పిపోయినందుకు ఇంట్లో అంతా బాధపడ్డారు - బాధపడనిది ఒక్క అరుణే! ఆ మాత్రం దానికి అమ్మాయి నచ్చిందీ చేసుకుంటాం అని వారు పెళ్ళిచూపుల నాడే ప్రకటించడ మెందుకో ముకుందరావుగారికి అర్థం కాలేదు. అయినా అన్నీ మన మంచికే అన్నట్లు వూరుకున్నారు.

నెల్లాళ్ళలోనే అరుణకి మరో సంబంధమొచ్చింది. అబ్బాయి అమెరికాలో ఇంజనీరు. ఈ సంబంధమెలాగూ కుదిరేది కాదు, పోనీ వచ్చిచూడనీ అనుకున్నారు ముకుందరావు గారు. అబ్బాయి తల్లీ తండ్రీ వచ్చారు. అరుణను చూశారు. "వీలైతే అక్కడ ఉద్యోగం చేయడానికి అనువుగా వుండే అమ్మాయే కావాలంటున్నాడు మా అబ్బాయి. శాస్త్రులుగారు మరీ మరీ చెప్పబట్టి వచ్చేం. మన యిష్టాయిష్టాలు అక్కడి వాళ్ళకి నప్పుతాయా?" అంటూనే అమ్మాయి ఫోటో, జాతకం తీసుకెళ్ళేరు. ఇరవై రోజులు తిరక్కుండానే, "మా వాడికి అమ్మాయి నచ్చిందట. జాతకాలూ సరిపోయాయి. మూడు నాలుగు నెలల్లో ముహూర్తాలు పెట్టించేయండి" అంటూ స్వయంగా వచ్చి అబ్బాయి ఫోటో కూడా యిచ్చి వెళ్ళేరు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. పెళ్ళి కొడుకు దొరబాబులా అందంగా వున్నాడు. అరుణ ఆనందానికి అవధుల్లేవు. కట్నకాన్కలు కూడా ఆశించకపోవడంతో ముకుందరావు గారు కూడా ఆనందంతో తబ్బిబ్బయ్యేరు. అలా అరుణమ్మ పెళ్ళికూతురై అమెరికా వెళ్ళిపోయింది.

ఆ ఏడాదే ముకుందరావుగారి అబ్బాయి ఆనంద్ ఇంటర్మీడియేట్ పాసై ఇంజనీరింగ్ చదవడానికి సిద్ధమయ్యేడు. కానీ అతగాడికి గవర్నమెంటు కాలేజీలో సీటు రాలేదు. ప్రైవేటు కాలేజీలో చదివించడానికి ముకుందరావుగారు కాస్త జంకేరు. నాలుగేళ్ళకీ ఫీజులూ, హాస్టల్ ఖర్చులూ కలిపి చాలానే అవుతుంది మరి! ఆ సమయంలోనే బొంబాయిలో మెరైన్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ముకుందరావుగారి పెద్ద బావమరిది రజనీకాంతరావు వచ్చేడు. ఆయన ఆర్నెల్లు సముద్రం మీద షిప్పుల్లో వుంటే, ఆర్నెల్లు

ఒడ్డున – అంటే దేశంలో వుంటాడు. రెండు చేతులా ఆర్జిస్తున్నాడని అనుకుంటారు.

"చదువుకి పెట్టింది ఎక్కడికీ పోదు బావా. నువ్వు చదివించు. వాడిని మెరైన్ ఇంజనీర్‌గా చేసే పూచీ నాది. ఈ రోజుల్లో ధైర్యం చేసి మనలాంటి వాళ్ళు అటువైపు వెళ్ళటం లేదు గానీ డబ్బుకి డబ్బూ, హోదాకి హోదా, విదేశీ పర్యటనలూ.. ఇక ఆలోచించకు" అంటూ అతగాడు ముకుందరావుగార్ని మరో మాట మాట్లాడనీయలేదు –

"కూతురి పెళ్లికి దాచిన కట్నం ఎలాగూ మిగిలిందిగా. చదివించేద్దూ" అంటూ కొసమెరుపు కూడా యిచ్చేడు.

తీరా నాలుగేళ్ళూ ఆనంద్ చదివి ఇంజనీరింగ్ డిగ్రీ చేతికి తెచ్చుకునే సరికి ఉద్యోగం మారిపోవడం వల్ల ప్లేటు ఫిరాయించేశాడు రజనీకాంతరావు.

"అప్పట్లో అవకాశాలుండేవి. ఇప్పుడందరూ డబ్బు కోసం యిటే మొగ్గుతున్నారు. కేవలం బేచులర్ డిగ్రీకి విలువేముందిప్పుడు? అవకాశం వస్తే చూద్దాం" అని తప్పించేసుకున్నాడు.

చదివించినందుకు ముకుందరావుగారు పశ్చాత్తాపపడలేదుగానీ మేనమామ మాటకు ఆశపడ్డ ఆనంద్ మాత్రం బాధపడ్డాడు. ఓ ఆర్నెల్లు పాటు ఏం చేయాలో, ఎటు వెళ్ళాలో తోచని పరిస్థితిలో వుండిపోయాడు.

సరిగ్గా ఆ సమయంలోనే అరుణ, ఆమె భర్త శ్రీకాంత్ అమెరికా నుండి రావటం; శ్రీకాంత్ కోసం వచ్చిన అతని ఫ్రెండు రాఘవ ఒక పూట తమ యింట్లో అతిథిగా ఉండటం జరిగింది. రాఘవ విశాఖలో ఓ పెద్ద పరిశ్రమలో మేనేజర్ స్థాయిలో వున్నాడు. ఆనంద్ గురించి శ్రీకాంత్ చెప్పగానే, "ఈ రోజుల్లో మెకానికల్ ఇంజనీర్స్‌కి కూడా డిమాండ్ ఎక్కువగానే ఉంది. అవకాశమొచ్చినపుడు చెబుతాను గానీ హోప్ పెట్టుకోవద్దు" అన్నాడు.

ఆ విషయం అక్కడితో మర్చిపోయారంతా. కానీ నాలుగు నెలల తర్వాత రాఘవే స్వయంగా ఫోన్ చేసి ఆనంద్‌ని పిలిపించి తనకు తెల్సిన కంపెనీలో ఆనంద్‌కి ఉద్యోగం రావటానికి కారకుడయ్యేడు.

నిజానికి ఆశపెట్టుకోవద్దని ఖచ్చితంగా చెప్పినాయన ఆ సంగతి పూర్తిగా మర్చిపోవచ్చు. కానీ అలా జరగలేదు. ఆయన ద్వారా జరిగిన ఉపకారం నిజంగా మరచిపోలేనిదే!

◆ ◆ ◆

బాధ్యతలు తీరేయి – యిక పాతబడి పోయిన ఇంటిని కాస్త బాగుచేయించుకోవాలనుకుంటున్న రోజుల్లో ఓ రోజు ఉదయం ముకుందరావుగారి సహోద్యోగి వీరాంజనేయులు వచ్చేడు. కాఫీలూ కుశల ప్రశ్నలూ అయ్యేక కూతురికి అనుకోకుండా పెళ్ళిసంబంధం కుదిరిందనీ, కంపెనీలో అతను అంతకుముందే ప్రావిడెంట్‌ఫండ్ లోను తీసుకోవడం వల్ల మళ్ళీ లోను పెట్టడానికి ఐదారు నెలలు వ్యవధి కావాలని; ఈలోగా ముకుందరావు గనుక ఓ పాతిక వేలు లోను పెట్టి సర్దితే ఆర్నెల్లలో – అనగా ఆ సంవత్సరం డిసెంబర్ నెలాఖర్లోగా – తప్పకుండా తీర్చేస్తాననీ; రెండో మాట వుండదనీ,

తనను యీ ఆపద నుండి గట్టెక్కించి సాయం చేయమని బతిమాలేడు - వీరాంజనేయులికీ తనకీ స్నేహం ఉంది. అయినా ముకుందరావుగారు వెంటనే ఏం మాట్లాడలేకపోయారు. ప్రస్తుతం వీరాంజనేయులు ప్రావిడెంట్‌ఫండ్ యూనిట్లో కూడా ఉండడం వల్ల తన ఎక్కౌంట్లో ఎంత వుందో; లోను పెట్టే అర్హత వచ్చిందో లేదో తెల్సుకునే వచ్చి ఉంటాడు. అయినా నిజం చెప్పడానికి కాస్త సంశయించేరు ముకుందరావుగారు.

"ఇల్లు బాగు చేయించుకోవాలనుకుంటున్నాను - ఆలోచించి వారం రోజుల్లో చెబుతాను" అన్నాడేగాని వారం రోజుల తర్వాత వీరాంజనేయులు మళ్లీ వచ్చి బతిమాలితే కాదనలేకపోయారు.

ఆడపిల్ల పెళ్లి, అబ్బాయి చదువు - ఇల్లు సమకూర్చుకోవడం - మధ్యతరగతి యింటి యజమానికి యీ మూడూ మూడే! ఆర్థిక సాయం చేయగలిగీ చేయని స్నేహమైనా, బంధుత్వమైనా ఉన్నా లేనట్టే అనుకుని అతనడిగినంతా లోను పెట్టి యిచ్చేరు ముకుందరావుగారు.

వీరాంజనేయులి కూతురి పెళ్లి ఆర్భాటంగా జరిగింది.

ఆర్నెలు గడిచాయి. పండగ వెళ్ళేక ఇంటి పని ప్రారంభించవచ్చుననుకున్న ముకుంద రావుగారు వీరాంజనేయులు కోసం డిసెంబరు నెలాఖర్నుంచే ఎదురు చూశారు. ఇబ్బం దేమైనా ఉంటే అతగాడు కలిసి చెప్పవచ్చును గదా అనుకుంటూనే మరో నెల కూడా ఎదురు చూశారు. అతగాడు ముఖం చాటేసుకు తిరుగుతున్నట్టు తర్వాత అర్థమైంది. ఈలోగా వార్త చేరనే చేరింది. వీరాంజనేయులు పండక్కి అల్లుడికి కొత్త స్టీరియో సెట్ కొని ప్రజెంట్ చేశాడనీ; స్వంతానిక్కూడా ఓ ఫ్రిజ్ కొనుక్కున్నాడనీ, అతను నిజంగా ఆర్థిక ఇబ్బందుల్లోనే వున్నాడనీ -

ఈమారు తన బలహీనత మీద తనకే కోపమొచ్చింది ముకుందరావుగారికి. మరో రెండు నెలల తర్వాత యే సంజాయిషీ యివ్వకుండానే మూడు దఫాలుగా వడ్డీ లేని అప్పును తీర్చేశాడు వీరాంజనేయులు.

ఈ సంఘటనలకు మూలకారణమైన తొలి సంభాషణలన్నీ ముకుందరావుగారింటి ముందుగదిలో ఆయన సమక్షంలో జరిగినవే! అందుకేనేమో ఆయనకు ఆ ముందు గది పట్ల అంత నమ్మకం ఏర్పడి పోయింది.

వీటన్నిటినీ మించిన మరో సంఘటన కూడా ఆయన నమ్మకాన్ని బలపరచిందే గాని వమ్ముచేయలేదు.

ముకుందరావుగారి చిన్న తమ్ముడు అనంతమూర్తి ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి ఈ మధ్యే ప్రమోషన్ మీద బెంగుళూరు బదిలీ అయ్యేడు. వెళ్ళేముందు వచ్చి రెండు రోజులు అన్నగారింట్లో కుటుంబంతో సహా ఉండి;

"మీరిద్దరూ, ఆనందూ బెంగుళూరు మా యింటికి రావాలి. రైళ్ళలో రిజర్వేషన్లు చేయించుకునే యిబ్బంది లేదు. మా ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ కార్లున్నాయి. వాటిల్లో మీరు

హాయిగా రావచ్చు. ఓ పది రోజులుండేట్లు వచ్చేరంటే కార్లోనే మైసూరు, ఊటీ వంటి ప్రదేశాలు కూడా చూడొచ్చు. నేను వెళ్ళి సెటిల్ అయ్యేక మీకు ఫోన్ చేస్తాను" అన్నాడు.

ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళని ముకుందరావుగారి భార్య కాస్త ఉత్సాహం చూపింది. ఇలాగైనా ఊరు కదిలి వెళ్ళి నాలుగూ చూడొచ్చని ఆశపడింది. అయితే ముకుంద రావుగారిలో మాత్రం ఏ ఉత్సాహమూ ఆశా కలగలేదు. ఆయన మనసులో ఎక్కడో ఏదో..లీలగా. ఓ నమ్మకం.

అనంతమూర్తి వెళ్ళి ఆర్నెల్లు దాటి పోయింది. అతని దగ్గర్నుంచి ఫోను కాదు గదా ఆ విషయమై ఉత్తరం ముక్క కూడా లేదు. ఈ సంఘటనతో ముకుందరావుగారి మనసులో లీలగా కదులుతూన్న అనుమానం బలమైన నమ్మకంగా మారి పోయింది.

ఇక లాభం లేదు. ఏదో చెయ్యాలి! అనుకుని నాలుగు రోజులు దీర్ఘంగా ఆలోచించారు. ఈ విషయమై ఎవరికి చెప్పినా నవ్వి తేలిగ్గా తీసి పారేయ్యవచ్చు. చివరకు భార్య కూడా నమ్మకపోవచ్చు. అంచేత ఓ శుభముహూర్తాన దక్షిణం వైపు సింహద్వారం ఉన్న ఆ దక్షిణ గదిని కొన్ని మార్పులతో తన బెడ్‌రూంగా మార్చుకుని, పడమటి వైపునున్న లివింగ్ రూంను డ్రాయింగ్ రూంగా చేసి, అటువైపు వీధిలోకి తోవ పెట్టేరు. ఆ యింటికి రెండు వైపులా రోడ్డుండడం అతనికలా లాభించింది.

◆ ◆ ◆

కొత్తగా మారిన గదిలో మొదటి రోజు నిద్ర కుపక్రమిస్తూ అప్పుడు చెప్పేరు భార్యతో అసలు సంగతి.

అంతా విని; "బాగానే ఉంది. అయితే యింతవరకూ ఇంటి యజమానిగా యీ గదిలో మీకెదురైన సమస్య యికపై ఇంటి ఇల్లాలుగా నాకు అనుభవం కావొచ్చన్న మాట" అంది.

ముకుందరావుగారికి మొదట ఆమె మాటలు అర్థం కాలేదు.

"దయచేసి మీరు మాత్రం నాకు ఏ విధమైన ప్రామిస్‌లూ చేయకండి ఈ గదిలో" అంది ఆమె నవ్వుతూ.

ముకుందరావుగారికి అప్పుడు అర్థమై భళ్ళున నవ్వేడు.

అయితే -

ముకుందరావుగారి భార్య అన్నట్టుగా ఏమీ జరగలేదు. ఆ గదిలోని ప్రామిస్‌లన్నీ ఆమెకు అటు ఇటుగా నెరవేరుతూనే వచ్చాయి.

*'ఇచ్చిన మాట నిలబెట్టుకునే నిజాయితీ మనుషుల మనసుల్లో వుండాలిగాని నోరు లేని గదులూ, చుట్టూ వున్న గోడలూ ఏం చేస్తాయి, సాక్షీభూతాలుగా మిగిలిపోవడం తప్ప!'* అనుకుని ఆ తర్వాత స్థిమితపడ్డారిద్దరూ. ◆